RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 136 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | శనివారం | జూలై | 19 | 2025 పేజీలు : 8 | వెల : రూ.2.00

## ఈగల్ టీమ్‌కు చిక్కిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, హెచ్ఆర్ మేనేజర్లు..!

హైదరాబాద్,జూలై,18:డ్రగ్స్ రహిత తెలంగాణనే లక్ష్యంగా సర్కారు చేపట్టిన చర్యల్లో భాగంగా శుక్రవారం, పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చిక్కారు. నగరంలోని గచ్చిబౌలిలో ఈగల్ టీమ్ చేపట్టిన డకాయ్ ఆపరేషన్‌లో గంజాయిని కొనుగోలు చేస్తూ వీరు పట్టుబడ్డారు. ఇలా పట్టుబడిన వారిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డెంటల్ టెక్నీషియన్లు, విద్యార్థులు ఉన్నారు. రెండు గంటల పాటు ఈగల్ టీమ్ నిర్వహించిన డకాయ ఆపరేషన్‌లో 86 మంది వరకూ పట్టుబడ్డారు. మార్కెటింగ్ ఉద్యోగులు, హెచ్ఆర్ మేనేజర్లు సైతం ఈగల్ టీమ్‌కు చిక్కిన వారిలో ఉన్నారు. బాయ్ బచ్చా ఆగయా అంటూ వాట్సాప్ గ్రూప్ ద్వారా గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు ఈగల్ టీమ్ అధికారులు గుర్తించారు.



### ఢిల్లీలో 20 స్కూళ్లకు..

## బాంబు బెదిరింపులు

### కొనసాగుతున్న తనిఖీలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఇవాళ 20 స్కూళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. బాంబు నిర్వీర్య బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. అనేక స్కూళ్ల వద్ద స్క్వాడ్స్ ఉన్నాయి. బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన స్కూళ్లలో సివిల్ లైన్స్‌లోని సెయింట్ గ్జావి యర్స్ , పశ్చిమ్ విహార్‌లోని రిచ్‌మండ్ గ్లోబల్ స్కూల్, రోహిణిలోని అభినవ్ పబ్లిక్ స్కూల్, ద సావిరిన్ స్కూల్ ఉన్నాయి. ఇతర స్కూళ్ల గురించి ఇంకా డిటేల్స్ అందాల్సి ఉన్నది. బుధవారం కూడా సుమారు ఏడు స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఢిల్లీలో బెదిరింపు మెయిళ్లు రావడం వారంలోనే ఇది మూడోసారి. మంగళవారం ఉదయం నార్త్ క్యాంపస్‌లో..

### మా పాలమూరు ప్రాజెక్టులకు

# అడ్డుపడకండి..

## ఇచ్చిన మాటప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలు చేశాం

### కొన్ని నెలల్లోనే మరో జాబ్ నోటిఫికేషన్

### నాగర్‌కర్నూల్ బహిరంగసభలో సీయం రేవంత్



నాగర్‌కర్నూల్, జూలై 18, :

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం కొనసాగుతున్న వేళ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలు లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేస్తున్న.. మాపాలమూరు ప్రాజెక్టులకు అడ్డం పడొద్దు. మీరు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సమానంగా అభివృద్ధి చేందాలనే ఆలోచనతో ఉన్నది నిజమే అయితే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రద్దు చేసి మా ప్రాజెక్టులు పూర్తయ్యేలా ఉదారంగా ముందుకు వచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్న.... మీరు ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడే కల్వకుర్తి ప్రాజెక్టు మొదలుపెట్టారు. మీరు సీఎంగా ఉన్నప్పుడే బీమా, కోయిల్ సాగర్, నెట్టెంపాడు ప్రాజెక్టులు వచ్చాయి. మీరు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు మొదలయ్యా యి. మీరు పదేళ్లు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులను కేసీఆర్ తన హాయంలో పూర్తిచేయలేదు. ఇప్పుడు మీరు ఈ ప్రాజెక్టులను అడ్డుకోవడం ఏ మేరకు న్యాయం. గతంలో పాలమూరు జిల్లాను మీరు దత్తత తీసుకున్నానని చెప్పారు. మా ప్రాజెక్టులను పూర్తి చేసుకోనిచ్చి మమ్మల్ని బ్రతకనివ్వండి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం వెనక నుండి 4 టీఎంసీల నీళ్లు తీసుకువెళ్లడాకి అవకాశం ఉంటే ఇప్పుడు తొమ్మిదిన్నర టీఎంసీల నీళ్లు తరలించేందుకు మీరు ప్రాజెక్టులు పెట్టుకున్నారు. రోజుకు 3 టీఎంసీల నీళ్లు తరలించే రాయలసీమకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రద్దు చేసి మీ ఉదారతను ప్రదర్శించండి. బిడ్డలు కృతజ్ఞత ఉన్నవారు. మీ మేలు ఎప్పటికి మర్చిపోమన్నారు. మా విజ్ఞప్తులు మీరు వినకపోతే పోరాటాలు ఎలా చేయాలో పాలమూరుకు తెలుసు. మాకు పౌరు షం ఉంది. పోరాడి సాధించుకునే శక్తి ఉంది. ఈ పోరాటానికి నాయకత్వం నేను వహిస్తాను' అన్నారు. అక్కడి సూర్యుడి ఇక్కడ ఉదయించినా, ఇక్కడి సూర్యుడు అక్కడ ఉదయించినా పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత నాది అని చెప్పారు.



## ట్రంప్ కు 'దీర్ఘకాలిక సిరల లోపం'

### వెల్లడించిన వైట్‌హౌస్

- ట్రంప్ కాళ్ల కింది భాగంలో వాపు
- సాధారణమైన సిరల వ్యాధితో బాధపడుతున్నట్లు తేలిందన్న వైట్‌హౌస్
- 70 ఏళ్లు పైబడిన వ్యక్తులలో తరచుగా కనిపిస్తుందని వెల్లడి,,

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 'దీర్ఘకాలిక సిరల లోపం'గా నిర్ధారణ అయిందని వైట్‌హౌస్ ప్రకటించింది. కాళ్ల కింది భాగంలో వాపు వచ్చిన తర్వాత ట్రంప్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా సాధారణమైన, నిరపాయక రమైన సిరల వ్యాధితో బాధపడుతున్నట్లు తేలిందని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరో లిన్ లీవిట్ వెల్లడించారు. లీవిట్ ప్రకారం, ట్రంప్ కాళ్లపై నిర్వహించిన అల్ట్రాసౌండ్ పరీక్షల్లో దీర్ఘకాలిక సిరల లోపం బయటపడిందని, ఈ పరిస్థితి 70 ఏళ్లు పైబడిన వ్యక్తులలో తరచుగా కనిపిస్తుందని జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. అదనపు పరీక్షల్లో ట్రంప్‌కు "గుండె వైఫల్యం, మూత్రపిండ వైఫల్యం లేదా దైహిక అనారోగ్య ం సంకేతాలు లేవు" అని గుర్తించినట్లు లీవిట్ చెప్పారు. కాలు వాపుతో పాటు ట్రంప్ చేతి వెనుక భాగంలో గాయాలు ఉన్నాయని కూడా లీవిట్ గుర్తించారు.



### 'గాంధీ'ల కోసం జైళ్లు

## ఎదురుచూస్తున్నాయి

### అస్సాం ముఖ్యమంత్రి హిమంత విశ్వ శర్మ

అస్సాం : 'గాంధీ'ల కోసం జైళ్లు ఎదురుచూస్తున్నాయని అస్సాం ముఖ్యమంత్రి హిమంత విశ్వ శర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. అవినీతి కేసుల్లో అస్సాం సిఎం హిమంత విశ్వశర్మ జైలుకి వెళతారని ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా గౌహతిలో హిమంత మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ పై విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ అస్సాంలోని గోల్పారాలో హింసను ప్రోత్సహించారని ఆరోపించారు.



### ముఖ్యమంత్రి పర్యటనలో కీలక పరిణామం

## కాంగ్రెస్‌లో చేరిన జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్..

నాగర్ కర్నూల్, జూలై 18, :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగర్ కర్నూలు పర్యటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. జడ్చర్ల మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అధికార కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఆమెతో పాటు కౌన్సిలర్లు చావా నాగరాజు, లలిత (బీజేపీ), గుండా ఉమాదేవి (బీఆర్ఎస్) కూడా చేరారు. ఈ కార్యక్రమం లో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు.. జిల్లాలోని కొల్లాపూర్ మండలం జటుప్రోలు మదనగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించారు. జటుప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలుకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్కౌంటర్..

### ఆరుగురు మావోయిస్టులు మృతి...



నారాయణపూర్, జూలై 18: ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులతో అబుజ్‌మార్ అటవీ ప్రాంతం దద్దరిల్లింది. నారాయణపూర్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టులు ఎదురుపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జరుగుతున్న ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మరణించినట్లుతెలుస్తోంది. ఆరుగురి మృతదేహాలతో పాటు.. ఏకే 47, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, పేలుడు పదార్థాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు. కాగా.. ఎన్కౌంటర్లో హతమైన మావోయిస్టుల వివరాలు ఇంకా వెల్లడించలేదు. ఆపరేషన్ ముగిసిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

### ప్రజాసంక్షేమం కోసమే

## ప్రజాప్రభుత్వం

### ప్రతి నిరుపేదకు రేషన్‌కార్డు పొందే హక్కుంది: మంత్రి సీతక్క

ములుగు,జూలై 18 :

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ప్రతి నిరుపేద వ్యక్తి రేషన్ కార్డు పొందే హక్కు ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలం లక్ష్మీ దేవి పేట గ్రామ పంచాయతీలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర లతో కలిసి రేషన్ కార్డు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసమే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ముఖ్యమంత్రి



ఏనుముల రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడమే కాకుండా నూతన పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రేషన్ కార్డులు మంజూరు కోసంగతంలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయడం జరిగిందని, నేడు అర్హులైన వారందరికీ నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు.

## కర్ణాటకలో కుమ్మేస్తున్న భారీ వర్షాలు..

### స్కూళ్లు, కాలేజీలకు సెలవు

- రెడ్, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన భారత వాతావరణశాఖ
- భద్రత దృష్ట్యా విద్యా సంస్థల మూసివేత
- రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఒడిశా తదితర రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండీ



బెంగుళూరు: కర్ణాటకలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అంగన్‌వాడీలు, స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల ప్రకారం ఉడుపి, ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, చిక్కమగళూరు, శివమొగ్గ, హసన, కొడగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ జారీ చేయగా, బెంగళూరు, మైసూరు, చామరాజనగర్, మాండ్య వంటి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. భద్రత దృష్ట్యా విద్యాసంస్థలను మూసివేయడంతో పాటు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఐఎండీ సమాచారం ప్రకారం కర్ణాటకతో పాటు రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఝార?ండ్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాజస్థాన్‌లో జైపూర్, టోంక్, సవాయి మాధోపూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అలాగే పశ్చిమ బెంగాల్‌లోని గంగా తీర ప్రాంతాలు, ఒడిశాలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ రాష్ట్రాల్లోనూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లలో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. దేశంలో ఈ ఏడాది రుతుపవనాలు సాధారణం కంటే 6 శాతం అధిక వర్షపాతాన్ని తెచ్చాయి.

